ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ | ఆదివారం 27, సెప్టెంబర్ 2027 | పేజీలు: 4 | వెల: రూ.1



## సజ్జనార్.. తీన్మార్

- నిమజ్జనం తర్వాత పోలీసులతో కలిసి డ్యాన్స్
- గణేశ్ నిమజ్జన మహోత్సవం ప్రశాంతంగా ముగిసింది
- సెక్రటేరియట్ వద్ద పోలీసుల సంబరాలు
- డీజే పాటలకు పోలీసుల ఉత్సాహభరిత నృత్యాలు
- సిబ్బందితో కలిసి డాన్స్ చేసిన సీపీ సజ్జనార్

2




## సర్ నోటీసులు..
## వ్యక్తిగత హాజరు అక్కర్లేదు

- అత్యవసర సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగత హాజరు
- నోటీసులకు ఆన్‌లైన్ లేదా ఇతర మార్గాల్లో స్పందించే అవకాశం
- ఫారం-6తో జత చేసిన డిక్లరేషన్‌ను సమర్థించిన ఈసీ
- సుప్రీంకోర్టు తీర్పును ప్రస్తావించిన ఎన్నికల సంఘం
- ఈసీ సమావేశానికి సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షత
- కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి హాజరు
- సర్ పై భిన్నాభిప్రాయాల నేపథ్యంలో కీలక సమావేశం
- డిప్యుటేషన్ అధికారి వ్యవహారంపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి లేఖ
- లేఖ ఈసీ లేదా ఐటీ విభాగం విధానపరమైన అంశం కాదన్న స్పష్టత
- సర్ ప్రక్రియపై ఈసీ నుంచి వరుస కీలక నిర్ణయాలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ఓటర్లు అత్యవసర పరిస్థితులు మినహా వ్యక్తిగత విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నోటీసులకు సంబంధించి ఓటర్లు అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పిస్తే సరిపోతుందని తెలిపింది. సర్ పై దేశవ్యాప్తంగా చర్చ, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈసీ తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.
సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అధ్యక్షతన శనివారం దిల్లీలో ఎన్నికల సంఘం కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి సమావేశానికి మిగతా 2లో..

## మన్మోహన్‌కు భారతరత్న
# ఇవ్వాలి

- మౌనమే భాషగా అద్భుత పరిపాలన అందించారు
- మన్మోహన్ గొప్ప రాజనీతిజ్ఞుడన్న సీఎం
- గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో విగ్రహావిష్కరణ
- మన్మోహన్ సేవలను కొనియాడిన రేవంత్
- భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయమని వ్యాఖ్య
- ప్రధాని మోదీకి రేవంత్ విజ్ఞప్తి
- పీవీ-మన్మోహన్ ఆలోచనలతో ఆర్థిక సంస్కరణలు
- వారి నిర్ణయాలతోనే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు
- అన్ని తరాలకు మన్మోహన్ జీవితం స్ఫూర్తి
- కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు




**హైదరాబాద్, (ప్రజాస్వరం):** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మౌనమే భాషగా చేసుకుని అద్భుతమైన పరిపాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. మన్మోహన్ సింగ్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు.

**భారతరత్న ఇవ్వాలి**
దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్న సమయంలో మిగతా 2లో..



## తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం చాకలి ఐలమ్మ..

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం
- భూస్వామ్య అణచివేతకు ధైర్యంగా ఎదురొడ్డి పోరాటం
- రైతాంగం, సబ్బండ కులాల హక్కుల కోసం ఐలమ్మ పోరాటం
- ఐలమ్మ స్ఫూర్తితోనే మలిదశ తెలంగాణ ఉద్యమం: కేసీఆర్
- ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- మహిళలు, రైతులు, సబ్బండ వర్గాల కోసం పథకాలు అమలు చేశాం
- కులవృత్తులకు జీవం పోసి ఆత్మగౌరవాన్ని పెంచాం
- ఐలమ్మ ఆశయాలే పరిపాలనకు మార్గదర్శకం కావాలి
- ప్రజా సంక్షేమమే ఐలమ్మకు నిజమైన నివాళి: కేసీఆర్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం.. తెలంగాణ సోయికి నిలువెత్తు నిదర్శనం చాకలి ఐలమ్మ అని మాజీ మంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగించడం ద్వారా మాత్రమే, ఐలమ్మకి నిజమైన నివాళి అర్పించినవాళ్ళమౌతామని తెలిపారు. నేడు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె త్యాగాలను స్మరించుకుంటూ మాజీ సీఎం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నాటి రాచరిక పాలనలో తెలంగాణ రైతాంగ న్యాయమైన హక్కుల కోసం ధిక్కార స్వరం మిగతా 2లో..

## నవంబర్‌లో కాళేశ్వరం పనులు పూర్తి

- రెండో వారంలో పునరుద్ధరణ చేపడతాం
- 2027 వానాకాలానికి ముందే పనులు పూర్తి
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ప్రత్యేక దృష్టి
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ కమిటీకి డిజైన్లు
- సాంకేతిక అనుమతుల తర్వాత పనులు ప్రారంభం
- భద్రత, నాణ్యత విషయంలో రాజీ లేదు
- జాతీయ సాంకేతిక సంస్థల సూచనలతో పనులు
- మూడు బ్యారేజీల భద్రత పటిష్ఠం
- పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించేలా చర్యలు
- ఎన్‌డీఎస్‌ఏ, నిపుణుల కమిటీ అభ్యంతరాల పరిశీలన


2

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 2027 వానాకాలానికి ముందే మిగతా 2లో..

## ఖైరతాబాద్ బరిలో తెలంగాణ రక్షణ సేన

- పోటీ చేస్తామని కవిత ప్రకటన
- తెలంగాణ రక్షణ సేన తరపున అభ్యర్థిని నిలబెడతామని వెల్లడి
- దానం నాగేందర్ తీరుపై పరోక్ష విమర్శలు
- ఫిరాయింపు రాజకీయాలు సమర్థనీయం కాదన్న కవిత
- ఓటర్ల జాబితా సవరణపై తీవ్ర ఆరోపణలు




**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేయనుందని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పార్టీ తరపున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు స్పష్టం చేశారు. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ కావడంతో ఉప ఎన్నికకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో కవిత ప్రకటన వెలువడింది. దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టులోనూ ఆయనకు మిగతా 2లో..




## 22-A ఆస్తుల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్..

- 22-A భూముల రిజిస్ట్రేషన్లకు కొత్త షరతులు
- లేఅవుట్, బిల్డింగ్ అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్
- HMDA, GHMC సహా స్థానిక సంస్థల అనుమతులు తప్పనిసరి
- లింక్ డాక్యుమెంట్లపై ప్రభుత్వం కీలక నిబంధనలు
- కోర్టు కేసులున్న ఆస్తులపై తుది తీర్పే కీలకం
- వివాదాస్పద ఆస్తులపై అధికారుల క్షుణ్ణ పరిశీలన
- 22-A సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి కమిటీలు
- కలెక్టర్ నేతృత్వంలో కమిటీ.. పలువురు అధికారులు సభ్యులు
- సందేహాలు, అభ్యంతరాలను కమిటీకి రిఫర్ చేయాలని ఆదేశం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలోని 22A పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం పలు కఠిన షరతులతో అనుమతిని ఇచ్చింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ 2026 సెప్టెంబర్ 24న ఒక ముఖ్యమైన మెమోను జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, సదరు ఆస్తికి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, బిల్డింగ్ లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం కల్పిస్తారు. ఇందులో HMDA, GHMC, CMC, MMC, DTCP లేదా సంబంధిత స్థానిక సంస్థల ఆమోదపత్రాలు తప్పనిసరి. అలాగే అనుమతి పొందిన తర్వాత నమోదైన చెల్లుబాటు అయ్యే, స్పష్టమైన లింక్ డాక్యుమెంట్లను బాధ్యులు తప్పనిసరిగా మిగతా 2లో..

## కేసీఆర్.. జనం గుండెల్లో
# ఉన్నారు

- పాలిచ్చే బర్రెను పక్కన పెట్టి దున్నపోతును తెచ్చుకున్నారు
- కేసీఆర్ బయటకు రాకపోయినా ఆదరణ తగ్గలేదు
- మూడేళ్లుగా ప్రజల్లోనే కేసీఆర్ ప్రభావం
- ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను తలుచుకుంటున్నారు
- కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారు
- రైతుభరోసాను ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపణ
- తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** బర్రెను పక్కన పెట్టి.. ప్రజలు తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మూడేళ్లుగా బయటకు రాకపోయినా ఆయనకు ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.
పనిచేస్తున్న ప్రభుత్వానికి కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే ఉద్దేశంతోనే కేసీఆర్ బయటకు రావడం లేదని కేటీఆర్ తెలిపారు. తాను బయటికి కనిపించకపోయినా కేసీఆర్ ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారని అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా ఆయనపై ఆదరణ ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు.
ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటోందని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా మిగతా 2లో..



# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**



మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారని రేవంత్‌రెడ్డి అన్నారు. భూసేకరణ చట్టంలో నిర్వాసితుల హక్కులను పరిరక్షించేలా ఆయన ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అలాంటి గొప్ప నేతకు భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయమని వ్యాఖ్యానించారు. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.

**పార్టీలకు అతీతంగా గౌరవించాలి**

పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించినప్పుడే మనకు విజ్ఞత ఉన్నట్లవుతుందని సీఎం అన్నారు. మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. ఆయన జీవితం జనరేషన్ జెడ్ సహా అన్ని తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**పీవీ-మన్మోహన్ ఆలోచనల ఫలితం**

మన్మోహన్ సింగ్, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆలోచనల ఫలితంగానే దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాయని రేవంత్‌రెడ్డి అన్నారు. వారిద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి అభివృద్ధి కూడా ఆర్థిక సంస్కరణల ప్రభావాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు.

**విగ్రహావిష్కరణ**

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో మన్మోహన్ సింగ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన జయంతి సందర్భంగా సెప్టెంబర్ 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో పాటు రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సజ్జనార్.. తీన్మార్

- **నిమజ్జనం తర్వాత పోలీసులతో కలిసి డ్యాన్స్**
- **గణేశ్ నిమజ్జన మహోత్సవం ప్రశాంతంగా ముగిసింది**
- **సెక్రటేరియట్ వద్ద పోలీసుల సంబరాలు**
- **డీజే పాటలకు పోలీసుల ఉత్సాహభరిత నృత్యాలు**
- **సిబ్బందితో కలిసి డాన్స్ చేసిన సీపీ సజ్జనార్**
- **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జన మహోత్సవం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని సెక్రటేరియట్ వద్ద డీజే పాటలకు పోలీసు సిబ్బంది ఉత్సాహంగా డాన్స్ చేశారు. ఈ వేడుకల్లో హైదరాబాద్ సీపీ సజ్జనార్ కూడా పోలీసులతో కలిసి నృత్యం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**రేయింబవళ్లు బందోబస్తు**

గణేశ్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా నగరంలో పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహించారు. ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది వరకు పోలీసులు రేయింబవళ్లు విధుల్లో పాల్గొన్నారు. నిమజ్జన ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు.

**సిబ్బందితో కలిసి సీపీ డాన్స్**

నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో సెక్రటేరియట్ వద్ద పోలీసులు సంబరాలు చేసుకున్నారు. డీజే పాటలు పెట్టుకుని సిబ్బంది నృత్యాలు చేశారు. ఈ సమయంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ కూడా వారితో కలిసి డాన్స్ చేశారు. ఉన్నతాధికారి తమతో కలిసి నృత్యం చేయడంతో పోలీసు సిబ్బంది మరింత ఉత్సాహంగా సంబరాలు జరుపుకొన్నారు.

**అధికారులూ పాల్గొన్న వేడుకల్లో**

సీపీ సజ్జనార్‌తో పాటు ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, అడిషనల్ జాయింట్ సీపీ తప్సిర్ ఇక్బాల్ కూడా డాన్స్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వివిధ జోన్ల డీసీపీలు సైతం ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఉన్నతాధికారులు, సిబ్బంది కలిసి ఉత్సాహంగా వేడుకలు చేసుకున్నారు.

**వైరల్‌గా వీడియోలు**

పోలీసులు డీజే పాటలకు డాన్స్ చేస్తున్న దృశ్యాలను పలువురు వీడియోలు తీశారు. ముఖ్యంగా సీపీ సజ్జనార్ పోలీసు సిబ్బందితో కలిసి డాన్స్ చేసిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విధుల్లో నిబద్ధతతో పనిచేసిన పోలీసులు నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో ఇలా సంబరాలు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# సర్ నోటీసులు.. వ్యక్తిగత హాజరు అక్కర్లేదు

**మొదటిపేజీ తరువాయి**

హాజరయ్యారు. సర్ ప్రక్రియ, ఫారం6, ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు ఈసీ వెల్లడించింది.

ఫారం6కు జత చేసిన డిక్లరేషన్ విషయంలోనూ ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టం చేసింది. SIR ఆదేశాల్లో భాగంగా అదనపు డిక్లరేషన్‌ను కోరుతున్నామని, ఫారం6లో మార్పు చేయలేదని ఈసీ పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా ఈసీ ప్రస్తావించింది.

సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల్లో తేడాలు, గత ఓటర్ల జాబితాతో అనుసంధానం లేకపోవడం వంటి కారణాలతో పెద్ద సంఖ్యలో నోటీసులు జారీ అవుతున్నాయి. అయితే నోటీసు అందుకోవడం వల్ల వెంటనే ఓటరు జాబితా నుంచి పేరు తొలగించినట్లు కాదని ఎన్నికల ప్రక్రియలో స్పష్టం చేస్తున్నారు. సంబంధిత ఓటర్లు తమ అర్హతను నిర్ధారించేందుకు అవసరమైన పత్రాలను సమర్పించే అవకాశం ఉంటుంది.

ఇదిలా ఉండగా, కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి ఎన్నికల కమిషనర్లు రాసిన లేఖపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు ఈసీ తెలిపింది. ఆ లేఖ ఈసీ లేదా ఐటీ విభాగాల విధానపరమైన అంశానికి సంబంధించినది కాదని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారి పనితీరుకు సంబంధించిన అంశమే లేఖలో ఉందని పేర్కొంది.

సర్ కు సంబంధించి ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ ఇప్పటికే వెల్లడించింది. బిహార్‌లో చేపట్టిన సర్, అనంతరం పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్టిన సవరణ ప్రక్రియలకు సంబంధించిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఆమోదించారని ఈసీ వర్గాలు తెలిపాయి.

ప్రస్తుతం కొనసాగుతున్న సర్ నేపథ్యంలో ఓటర్లకు జారీ అవుతున్న నోటీసులు, వాటికి స్పందించే విధానం, ఫారం6కు సంబంధించిన డిక్లరేషన్‌పై వివాదాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ నేపథ్యంలో శనివారం ఈసీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై స్పష్టత ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.



# నవంబర్‌లో కాళేశ్వరం పనులు పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన అంశాలపై మంత్రి చర్చించారు.

అక్టోబర్ 5న సీడబ్ల్యూసీ సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి పునరుద్ధరణ పనులకు సంబంధించిన డిజైన్లను సమర్పించనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. సాంకేతిక అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పునరుద్ధరణలో భద్రత, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సూచనల మేరకే పునరుద్ధరణ పనులు చేపడతామని మంత్రి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను మరింత పటిష్ఠం చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మూడు బ్యారేజీలను వాటి పూర్తి సామర్థ్యంతో పనిచేసే స్థాయికి తీసుకురావడమే లక్ష్యమని వెల్లడించారు.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), నిపుణుల కమిటీలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నామని ఉత్తమ్ తెలిపారు. ఆయా సాంకేతిక సూచనలు, భద్రతా అంశాలను పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

సాంకేతిక ప్రక్రియ పూర్తయిన అనంతరం నవంబర్ రెండో వారంలో పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. బ్యారేజీల భద్రత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ పనులను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు.

# ఖైరతాబాద్ బరిలో తెలంగాణ రక్షణ సేన

**మొదటిపేజీ తరువాయి**

ఉపశమనం లభించకపోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైనట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

**ఫిరాయింపులపై విమర్శలు**

పార్టీ ఫిరాయింపులపై కవిత తీవ్రంగా స్పందించారు. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం సమర్థనీయం కాదని ఆమె వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. 2023లో బీఆర్‌ఎస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. అనంతరం ఆయన అనర్హతకు సంబంధించిన వ్యవహారం న్యాయస్థానాల వరకు వెళ్లింది.

**ఓటర్ల జాబితాపై ఆరోపణలు**

కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపైనా కవిత స్పందించారు. కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయని చెప్పారు. బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందన్న చర్చ ప్రజల్లో ఉందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని కవిత అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ఈ రంగాలపై దృష్టి సారించి పరిస్థితులను చక్కదిద్దాలని డిమాండ్ చేశారు.

# 22A ఆస్తుల రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్..

**మొదటిపేజీ తరువాయి**

సమర్పించాల్సి ఉంటుంది.

న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లు మాత్రం కోర్టు ఇచ్చే తుది తీర్పులు, ఆదేశాలకు లోబడే ఉంటాయి. వివాదాల్లో ఉన్న ఆస్తుల కేసు తీవ్రత, పరిధిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వాటి రిజిస్ట్రేషన్‌పై అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారు. ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎలాంటి సమస్యలు, వివాదాలు తలెత్తినా వాటిని పరిశీలించేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించే ఈ కమిటీలో అదనపు కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, HMDA లేదా సంబంధిత స్థానిక సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. 22A నిబంధనలకు సంబంధించి ఎదురయ్యే సందేహాలు, అభ్యంతరాలను ఈ జిల్లా స్థాయి కమిటీకి రిఫర్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.


# కేసీఆర్.. జనం గుండెల్లో ఉన్నారు

**మొదటిపేజీ తరువాయి**

ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు సొమ్ము సకాలంలో రైతుల ఖాతాల్లో జమయ్యేదని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతు భరోసా చెల్లింపులను ఎగ్గొట్టిందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలు, ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయాల మధ్య తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.



## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ
# 131వ జయంతి వేడుకలు

**నార్సింగి ( ప్రజా స్వరం ) సెప్టెంబర్ 26**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను సంకాపూర్ గ్రామం లో ఘనంగా నిర్వహించారు. స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, గ్రామస్థులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అన్యాయాలకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా లొంగిపోకుండా ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమ నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా నేటి యువత ఐలమ్మ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని, ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను సాధించాలని వారు పిలుపునిచ్చారు. ఈ ఘన నివాళుల కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సుజాత శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు బోడ కృష్ణ, ముఖ్య నాయకులు మల్లేష్, కుమార్, సిద్ధేశ్, యాదగిరి, రాములు, గంగారం, సత్తయ్యలతో పాటు వార్డు సభ్యులు శ్యామ్, రవి, స్థానిక రజక సంఘ ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం చాకలి ఐలమ్మ..

**మొదటిపేజీ తరువాయి**

వినిపించిన ధీరవనిత ఐలమ్మ అని, అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచారని కేసీఆర్ కొనియాడారు. నాటి భూస్వాములను ధైర్యంగా ఎదురించి ధిక్కారాన్ని చాటడమే కాకుండా, నాటి చట్టాల పరిధిలోని న్యాయస్థానాల్లో పోరాడి గెలిచి ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించిన ఆమె పోరాట పంథా నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రస్తుత అస్తవ్యస్త పాలనా రాజకీయ పరిస్థితుల్లో, ఐలమ్మ చూపించిన ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి, తెలంగాణ సోయి నేటి యువత తప్పక అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. శాంతియుత పంథాలో తాను ప్రారంభించిన మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కూడా ఐలమ్మ అందించిన స్ఫూర్తి ఇమిడి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని గుర్తుచేశారు.

ఐలమ్మ గొప్పతనాన్ని, ఆమె పోరాట చరిత్రను భవిష్యత్తు తరాలకు చాటేందుకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సాంప్రదాయాన్ని నెలకొల్పిందని కేసీఆర్ తెలిపారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగానే పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో మహిళలు, శిశు సంక్షేమం, రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అనేక వినూత్న పథకాలను అమలు చేశామన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేస్తూ, కుల వృత్తులకు జీవం పోసి సబ్బండ వర్గాల ఆర్థిక, సామాజిక ఆత్మగౌరవాన్ని సమున్నతంగా నిలబెట్టామని, ఆ నమూనా సాధించిన ఫలితాలు నేడు దేశానికే మార్గదర్శకంగా నిలిచాయని చెప్పారు. తెలంగాణ రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగించడం ద్వారా మాత్రమే ఐలమ్మకు మనం నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ఇంటికి వెలుగు కూతురు

**ఇంటి మహా లక్ష్మి కూతురు**
**కూతురే ఒక ప్రపంచం**
**కూతురు మనసు మందారం**
**మనిషి బంగారం**
**కూతురు ప్రేమ అంతులేనిది!!**
**కూతురు అంటే ఆకాశం అంత ప్రేమ**
**కూతురికి మించిన ప్రేమ మరో ఒకటి**
**ఏది లేదు**
**ఈ ప్రపంచంలో**
**మంచి చెడులకు తోడుండేది**
**చిరునామా కూతురు!!**
**సెప్టెంబర్ 27 కూతుళ్ల దినోత్సవం**
**సందర్భంగా..**

**రచన:-**
**దేవులపల్లి రమేశ్**
**కలం : వామిక శ్రీ వర్ష**
**సిద్దిపేట, నంగునూర్**
**9963701294**



## కాళ్లకల్ శివారులో . అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై సివిల్ సప్లై పోలీసులు దాడులు!

**తూప్రాన్ సెప్టెంబర్ 26( ప్రజా స్వరం )**

మెదక్ జిల్లా కాళ్లకల్ శివారులో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాం పట్టివేత గృహ సిలిండర్ల నుండి వాణిజ్య సిలిండర్లకు రీఫిల్లింగ్ దందా పౌరసరఫరాల, పోలీసుల సంయుక్త దాడులు మెదక్ జిల్లా కాళ్లకల్ శివారులో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై అధికారులు దాడులు నిర్వహించడం సంచలనంగా మారింది.

గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్ల నుండి గ్యాస్ ను తీసి, వాణిజ్య సిలిండర్లలోకి అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్నారన్న పక్కా సమాచారంతో పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు, విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు

ఈ గోదాంలో భారీగా డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రీఫిల్లింగ్ కు ఉపయోగించే మోటార్లు, పరికరాలను కూడా అధికారులు సీజ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా తక్కువ ధర గృహ సిలిండర్లను ఎక్కువ ధరకు వాణిజ్య అవసరాలకు విక్రయిస్తూ ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ దందాపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ప్రయివేట్ పాయింట్ గ్యాస్ ఏజెన్సీ తీసుకొని అందులో నుండి 10 kg సెలెండర్ లకి మారుస్తూ అమ్మకాలు చేస్తున్నారు వాటి తో పాటు కొన్ని బీపీసీ ఐఓసీ సెలెండర్లు ఉన్నాయి ఈ ఏజెన్సీ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచించుడాల్సిందే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- **అంబేద్కర్ నగర్ దోబీఘాట్ లో ఐలమ్మ విగ్రహానికి నివాళులు**
- **ట్యాంక్ బండ్ పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటుచేసి- రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి**
- **రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేష్**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 26 (ప్రజాస్వరం)**

తెలంగాణ పోరాటానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని రజక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేష్,జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. శనివారం భూమి కోసం, భుక్తి కోసం,వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన తొలి తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ దోబీఘాట్ లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. నిజాం, దేశ్ముకులకు వ్యతిరేకంగా ఆమె చూపిన తెగువ, ధైర్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.రజక వృత్తిని నమ్ముకున్న కుటుంబాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దోబీఘాట్ల ఆధునీకరణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్, రజక సంఘం నాయకులు,పొలాస సాయికుమార్,పొలాస కిరణ్ కుమార్, నాయకులు డిఎస్ ఎస్ వెంకటేష్,అబ్బ గోని రాజ్ కుమార్ గౌడ్,పెద్ది మురళి,బల్లి శ్రీధర్,నాయకం భాస్కర్ జనార్ధన్,సత్తయ్య, యాదగిరి,క్రాంతి సమ్మయ్య శోభన్,యాదగిరి,మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

**జవహర్ నగర్, సెప్టెంబర్ 26, (ప్రజాస్వరం):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మని జోకర్ నగర మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం సాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జవహర్ నగర్ లోని లక్ష్మీనరసింహ కాలనీలో ఏర్పాటుచేసిన ఆమె విగ్రహానికి దేశ్ముఖ్ దొరలకు వ్యతిరేకంగా ఒంటరి పోరాటం కొనసాగించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మంద లక్ష్మీనారాయణ, కేకే చారి, కాలనీవాసులు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ 131వ జయంతి - తూప్రాన్ లో ఘనంగా నివాళులు

**తూప్రాన్ సెప్టెంబర్ 26( ప్రజా స్వరం )**


మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి తూప్రాన్ లో చాకలి ఐలమ్మ విగ్రహనికి పూల మాలల వేసి తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్ మరియు రజక సంఘం ఆధ్వర్యంలో నివాళులు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు నేడు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి.

తూప్రాన్ పట్టణంలో కూడా రజక సంఘం, బహుజన సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు, దొరలకు, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ధైర్యం, తెగువ నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని ఆమె అన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఐలమ్మ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ లు జైపాల్ రాథోడ్ చెలిమల రాములు ఐలేష్ యాదవ్ నారాయణ గుప్త లయన్ జానకి రామ్ గౌడ్ కొట్టాంల ఉపేందర్ బయికాడి నర్సింలు ఆంజనేయులు యాదిగిరి ముత్యాలు ఎల్లం తదితరులు పాల్గొన్నారు





# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్రం

- **ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించిన ఘనత కేసీఆర్‌దే:మాజీ మంత్రి హరీష్ రావు**

**గజ్వేల్ సెప్టెంబర్ 26 (ప్రజాస్వరం):-**




భూమి కోసం , భుక్తి కోసం ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

ఈరోజు గజ్వేల్ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీష్ రావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ పోరాట చరిత్రను గుర్తు చేసుకున్నారు.

నిజాం కాలంలో భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరీ వంటి అణచివేతలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని తెలిపారు. తన భూమి, పంటను కాపాడుకోవడంతో పాటు అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా నిలబడి పోరాడిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

చాకలి ఐలమ్మ అంటే ఒక పేరు కాదు.. ఒక పోరాట స్ఫూర్తి. ఆమె ధైర్యం తెలంగాణ మహిళలకు, అణగారిన వర్గాలకు ఎప్పటికీ ఆదర్శం అని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. ఐలమ్మ వంటి తెలంగాణ వీరుల చరిత్రను గుర్తించి, వారి త్యాగాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తిని గౌరవిస్తూ ఆమె పేరును చిరస్థాయిగా నిలిపే కార్యక్రమాలకు కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చాకలి ఐలమ్మ భవన్ నిర్మాణానికి రూ.కోటి నిధులు కేటాయించి, రాష్ట్రంలో ప్రత్యేకంగా నిలిచేలా భవనాన్ని నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఐలమ్మ పేరుతో నిర్మించిన ఈ భవనం ఆమె పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు.

అదేవిధంగా పక్కనే ఉన్నా పాండవుల చెరువు ఇడుపు కాయితాలకే పరిమితమైన పాండవుల చెరువును కేసీఆర్ ఆధ్వర్యంలో సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. కొండపోచమ్మ మల్లన్నసాగర్ ప్రాజెక్టులతో గజ్వేల్ నియోజకవర్గంలో సాగునీటికి ఇబ్బంది లేకుండా కేసీఆర్ ఎనలేని కృషి చేశారని,గోదావరి నదిలో నీళ్లు వృథాగా వెళ్తున్నా ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతుందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.కేసీఆర్ హయాంలో వేసిన రోడ్లకు గుంతలు పడితే కనీసం ప్యాచ్ వర్క్ చేసే పరిస్థితి లేదని,కేసీఆర్ జిల్లా ఆసుపత్రిని,మెటర్నిటీ ఆసుపత్రిని నిర్మించి పేద ప్రజల వైద్యం కోసం కృషి చేయగా కనీసం డాక్టర్లను నియమించే పరిస్థితి లేదని,సూది మందులు కూడా సరిగ్గా ఇవ్వలేని దుస్థితికి ప్రభుత్వ ఆసుపత్రులను దిగజార్చడంతో పేదలకు వైద్యం కరువయ్యే పరిస్థితి నెలకొందన్నారు.

అయితే ప్రస్తుతం కేసీఆర్ హయాంలో నిర్మించిన భవనాలు, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని కనీసం వాటికి సున్నాలు కూడా వేసే పరిస్థితి లేదని విమర్శించారు.

చాకలి ఐలమ్మలాంటి ధైర్యశాలి మహిళల పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వారి స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో వారి వెంట నాయకులు,రజక సంఘం ప్రతినిధులు ,కార్యకర్తలు తదితరులు ఉన్నారు







## గ్రామ సర్పంచులు, అధికారుల సమన్వయం తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం..

- **మండల ప్రత్యేక అధికారి నీలిమ**

**నార్సింగి ( ప్రజా స్వరం )**

నార్సింగి మండల కేంద్రం లోని రైతు వేదికలో ప్రత్యేక అధికారి నీలిమ ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి నిర్వహించిన పనులు, భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని కులాల నిరుద్యోగ యువతకు దాదాపు 300 ఉపాధి కోర్సుల లో అన్ని వసతులు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, గ్రామ సర్పంచులు దృష్టి సారించాలని అన్నారు. ఎంపీడీఓ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్లాస్టిక్ వాడకం పై దృష్టి సారించాలని, చేతి సంచులను వినియోగించేలా అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలకు అవసరమైన భవనాలు ఇతర పనుల కు గ్రామ సభలలో తీర్మానాలు చేస్తే పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మిషన్ భగీరథ శాఖ ఏఈ స్వప్న మాట్లాడుతూ మండలానికి నీరు ముఖ్యంగా గజ్వేల్, మెదక్ సెక్టార్ నుంచి సరఫరా జరుగుతాయని తెలిపారు. సింగూరు జలాశయం లో నీటి ఎద్దడి కారణంగా రెండు నెలల వరకు మెదక్ సెక్టార్ కు నీరు సరిపడతాయని, అటుపై నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. నీటి ఎద్దడి నివారణ చర్యల పై దృష్టి పెట్టాలని, బోర్ మోటార్ల లో నీరు వృధా కాకుండా చూసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ ఏఈ స్వామి మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వల్ల హైడ్రల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి స్థాయిలో పని చేయకపోవడం వల్ల వ్యవసాయానికి 12 గం విద్యుత్ అందిస్తున్నామని, భవిష్యత్ అవసరాల కోసం సోలార్ విద్యుత్ వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎలినినో ప్రభావం తో గోవులలో లంపి చర్మ వ్యాధి ప్రబలుతుందని, అన్ని గ్రామాలలో నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. మరోసారి కూడా టీకాలు వేయడం జరుగుతుందని అన్నారు. నార్సింగి సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల మలి విడత మంజూరు గురించి ప్రశ్నించగా, దసరా వరకు వెల్లడిస్తామని హౌసింగ్ ఏఈ తెలిపారు. పెద్ద తాండా సర్పంచ్ దుషాని ఛత్రియా నాయక్ తాండా లో నీటి కొరత ఉందని ఓవర్హెడ్ ట్యాంక్ నిర్మించాలని కోరగా పై అధికారులకు నివేదించి నిర్మాణం జరిగేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జప్తి శివునూరు, నర్సంపల్లి, శంఖాపూర్ తాండా సర్పంచులు గైర్హాజరు అవ్వగా మిగతా గ్రామాల సర్పంచులు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశం గౌడ్

- **చేగుంట రెడ్డిపల్లిలోని నార్సింగి కేజీబీవీని పరిశీలించిన సర్పంచ్, ఎంపీడీఓ..**
- **వసతులపై విద్యార్థులతో ఆరా..**
- **నార్సింగిలోనే సొంత భవనం కోసం కృషి చేస్తాం: సర్పంచ్ సుజాత**


**నార్సింగి ప్రజా స్వరం సెప్టెంబర్ 26**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (KGBV) చదువుకునే విద్యార్థినులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు అందించాలని నార్సింగి గ్రామ సర్పంచ్ ఆకుల సుజాత మల్లేశ్ గౌడ్ అధికారులను కోరారు. శనివారం చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న నార్సింగి కేజీబీవీ పాఠశాలను నార్సింగి ఎంపీడీఓ తిరుపతి రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆకుల మల్లేశ్ గౌడ్‌లతో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదిని, తరగతి గదులను పరిశీలించి విద్యార్థినులకు అందుతున్న భోజన వసతులు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వసతులు సంతృప్తికరంగా ఉన్నాయని సర్పంచ్ పేర్కొన్నారు.

**సొంత భవనం కోసం ప్రజాప్రతినిధుల దృష్టికి**

అనంతరం సర్పంచ్ సుజాత మల్లేశం గౌడ్ మాట్లాడుతూ నార్సింగి మండలానికి చెందిన ఈ విద్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం చేగుంట మండలం రెడ్డిపల్లిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. నార్సింగిలోనే ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, కేజీబీవీకి శాశ్వత భవన నిర్మాణం జరిగేలా ప్రజాప్రతినిధుల మద్దతు కూడగడతామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# చందంపేట గడికి పూర్వవైభవం: పునరుద్ధరణ పనులను పరిశీలించిన ఎంపీడీవో దామోదర్

- **చారిత్రక కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీడీవో**
- **సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేగంగా సాగుతున్న పనులు**
- **పురాతన కట్టడాల దినోత్సవానికి ముస్తాబవుతున్న చందంపేట గ్రామం..**

**చిన్న శంకరంపేట ( ప్రజా స్వరం ) సెప్టెంబర్ 26**

చిన్నశంకరంపేట మండల పరిధిలోని చందంపేట గ్రామానికి చారిత్రక గుర్తింపుగా నిలిచిన పురాతన గడి పునరుద్ధరణ పనులను శనివారం ఎంపీడీవో దామోదర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దామోదర్ మాట్లాడుతూ పురాతన కట్టడాల పరిరక్షణకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో మన సంస్కృతిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగబోయే పురాతన కట్టడాల దినోత్సవ వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**మహిళలు, యువతే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు: సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్**

గడి పునరుద్ధరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని సర్పంచ్ నాయిని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పురాతన కట్టడాల విశిష్టతను చాటిచెప్పేలా గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా మహిళలు, యువత, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ముగ్గుల పోటీలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ నర్సింలు, ఫీల్డ్ అసిస్టెంట్ భూషణం మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# అసహజ మరణాలపై చర్యలు తీసుకోండి

- **జవహర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి-జవహర్ నగర్ సిఐ సైదులుకు వినతి**

**జవహర్ నగర్, సెప్టెంబర్ 26,(ప్రజాస్వరం):**

జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న అసహజ మరణాలపై ప్రభుత్వం, పోలీసులు తగిన చట్టబద్ధమైన చర్యలు చేపట్టాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు అన్నారు. శనివారం వైయస్సార్ నగర్ లో మరణించిన బొల్లం కృష్ణ భాదిత కుటుంబ సభ్యులచే అసహజ మరణాలపై చర్యలు తీసుకోవాలని జవహర్ నగర్ సీఐ సైదులు వినతిపత్రం అందజేశారు. జవహర్ నగర్ రామ్కీ డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే రసాయనాలు, విష వాయువుల వల్ల డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలలో అసహజ మరణాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని వీటిపై దర్యాప్తు చేపట్టి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలోజేఏసి చైర్మన్ షేక్ షావలి(ఇఫ్టూ),కన్వీనర్ ఉమామహేష్(సిపిఐ), కోశాధికారి పి.శివబాబు(ఐ.ఎఫ్.టి.యు), కో కన్వీనర్స్ గడ్డం సదానందం(సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్), సుబ్రమణ్యం(మాజీ కార్పొరేటర్), వై మల్లేష్ (ఏ.ఐ.ఎఫ్.టి.యు), జయ(సిఎంఎస్), డి. జాన్(పికెఎం),
గడిపే సునిత (పిఓడబ్ల్యూ(విముక్తి)), వి.ప్రవీణ్ (టియుసిఐ), దశరథ (సీపిఐ), అంబాల ఎల్లయ్య (ఏఐటీయూసీ), జయసుధ (పిఓడబ్ల్యూ) తదితరులు పాల్గొన్నారు.



# తూప్రాన్ కోర్టు భవనాన్ని పరిశీలించిన..జిల్లా జడ్జి నీలిమ

**తూప్రాన్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం ) ప్రతినిధి**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణం లో నూతనంగా మంజూరైనా జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని శనివారం జిల్లా న్యాయమూర్తి నీలిమ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి మిగితా పనులను త్వరగా పూర్తి చేయాలనీ అదేశించారు.పనులు పూర్తియితే కోర్టు ప్రారంబం వల్ల తూప్రాన్ తో పాటు పరిసర మండలల ప్రజలకు అందుబాటు లో కి వస్తుందని ఆమె అన్నారు ఈ కార్యక్రమం తూప్రాన్ అర్డీఓ బావయ్య డిఎస్పీ నరేందర్ గౌడ్ సిఐ వెంకట రాజా గౌడ్ ఎసై గంగరాజు డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు





# అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాం పై దాడి..

- **296 సిలిండర్లు స్వాధీనం...**

**మెదక్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం)**

కాళ్లకల్ గ్రామ శివారులో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల నిల్వ చేస్తున్న గోదాంపై సివిల్ సప్లై, పోలీసు అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి పి. నిత్యానందం ఆదేశాల మేరకు సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సిములు, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 296 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల అక్రమ నిల్వ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల అక్రమ నిల్వ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లై అధికారి హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

# తూప్రాన్ లో 2K వాక్‌ఎథాన్

**తూప్రాన్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం )**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు శనివారం ఉదయం 2కే వాక్‌ఎథాన్ నిర్వహించారు. ఎసై గంగరాజు మాట్లాడుతూ...ఆరోగ్యకర సమాజం కోసం నడుద్దాం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీలో పాల్గన్న వారి కి పేర్కొన్నారు
మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో 2K వాక్ ఎథాన్ కార్యక్రమం నిర్వహించనున్నారు.
ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి అడుగు కీలకం" అనే నినాదంతో ఈ వాక్ ఎథాన్ ను నిర్వహిస్తున్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారి గుండా ఈ 2 కిలోమీటర్ల వాక్ సాగింది వైద్యులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.
ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించి, నడకను దినచర్యలో భాగం చేసుకోవాలని ఎసై గంగరాజు పిలుపునిచ్చారు. ఈ వాక్ ఎథాన్ తూప్రాన్ పట్టణంలో ఆరోగ్య చైతన్యానికి నిదర్శనంఅని ఆయన అన్నారు ఈ కార్యక్రమం లో లయన్ జానకిరామ్ గౌడ్ డాక్టర్ ప్రదీప్ సింహ మాజీ కౌన్సిలర్ మామిడి వెంకటేష్ పట్టణ ప్రముఖులు బలగం కమిటీ విశ్వకర్మ కర్మిక విభాగం విద్యార్థులు మెడవన్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# ప్రజల మధ్యే.. అలుపెరగని తిరుపతిరెడ్డి..

- **ప్రజాసేవ కు విరామం లేదు.. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండ.. కార్యకర్తలకు భరోసా..**
- **గ్రామగ్రామాన పర్యటన.. ప్రజలే ప్రథమం.. సేవే లక్ష్యం.**
- **అలుపెరగని పర్యటనలు.. ప్రజలతో మమేకం..**

**మెదక్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం)**

పండుగ వేళల్లో ప్రజలతో మమేకమవుతూ.. కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో గ్రామగ్రామాన తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మెదక్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో తిరుపతి రెడ్డి పర్యటించారు. గణేష్ మండపాలను సందర్శించి గణనాథులను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పలు ప్రాంతాల్లో జరిగిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

**ఒక్కరోజే 10 నుంచి 12 ప్రాంతాల్లో పర్యటన**

ఒక్కరోజులోనే సుమారు 10 నుంచి 12 ప్రాంతాల్లో పర్యటించిన తిరుపతిరెడ్డి.. ఎక్కడికి వెళ్లినా స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ తీరును మండలి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు.

**కార్యకర్తల కుటుంబాలకు అండ**

పర్యటనలో భాగంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను తిరుపతిరెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబం తన కుటుంబమేనని పేర్కొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సాయం**

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన తిరుపతిరెడ్డి.. వారి పరిస్థితులను తెలుసుకున్నారు. అవసరమైన వారికి తనవంతు ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని చెప్పారు.

**'పదవి ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యనే'**

ప్రజలకు సేవ చేయడానికి పదవి అవసరం లేదని తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి కావాలన్నదే తన ఉద్దేశమన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజలతో నేరుగా మమేకం కావడమే తన లక్ష్యమని తెలిపారు.

**ప్రజల యోగక్షేమాలే లక్ష్యంగా..**

ఉదయం నుంచి రాత్రి వరకు వరుస కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ ప్రజలను కలిసేందుకు సమయం కేటాయిస్తున్నారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు కార్యకర్తల కుటుంబాల పరామర్శ, బాధితులకు సహాయం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దీంతో గ్రామాల్లో ఆయన పర్యటనలు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

**మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే: తిరుపతిరెడ్డి**

ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు, మిషన్ భగీరథ వంటి పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన విమర్శించారు. మరో మూడేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు గతంలో అందించిన సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు.ప్రజలతోనే.. ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు.



# రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలి...

- **ఆరుతడి పంటల పై రైతులు దృష్టి సారించాలి...**
- **మంత్రి, మెదక్ ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి....**

**మెదక్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం)**

శనివారం మెదక్ పట్టణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకట స్వామి, మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, నీటి పొదుపు పద్ధతులు, యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు, పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ప్రభుత్వం రైతాంగానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక విధానాలను వ్యవసాయంలో అవలంబించాలని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చు అని తెలిపారు. కిసాన్ మేళాలో వివిధ వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, వ్యవసాయ యాంత్రీకరణ సంస్థలు, విత్తన/ఎరువుల సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతులకు అవసరమైన సమాచారం అందించారు.

ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి తగిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, మున్సిపల్ చైర్పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఏడి శ్రీధర్ రాజశేఖర్ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, శాస్త్రవేత్తలు సతీష్, సాంబాజి దత్తాత్రేయ నాల్కర్, ప్రొఫెసర్ నిర్మల, రాఘవేంద్ర, ఆదిత్యలు పాల్గొన్నారు.



# ప్రపంచంలోనే అరుదైన పథకం సీఎం బ్రేక్ ఫాస్ట్

- **మంత్రి, మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి...**



ప్రపంచంలో అత్యంత అరుదైన పథకం సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం అని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోనీ మార్కెట్ యార్డ్ లో నూతనంగా నిర్మించిన కేంద్రీకృత కిచెన్ ను మంత్రి వివేక్ వెంకటస్వామి, శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు,జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో కలిసి ప్రారంభించారు. కేంద్రీకృత కిచెన్ యంత్రాలకు పరిశీలించి వాటి సామర్థ్యం ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెదక్ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షనల్ లో ప్రభుత్వ విద్యార్థులకు అల్పాహారం వడ్డించి , విద్యార్థులతో పాటు కలిసి అల్పారాన్ని తిన్నారు. అల్పాహారం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చి ముఖ్యమంత్రి అల్పాహారం పథకం అమలు చేస్తున్నామన్నారు. నాణ్యమైన, పౌష్టికరమైన అల్పాహారం అందించడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. హారికృష్ణ మూమెంట్ టీంకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలన్నారు. పాఠశాలలకు మార్నింగ్ 8:30 కి టిఫిన్ వస్తుందనీ, రాష్ట్ర వ్యాప్తంగా 36 కిచన్ లు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఇప్పటికే 10 వేల టీచర్స్ భర్తీ చేశాం అని,మెదక్ లో యంగ్ ఇండియా స్కూల్ ను 2,500 మంది విద్యార్థులకు వచ్చే సంవత్సరం నుండి ప్రారంభిస్తామన్నారు. మెదక్ కు 100 కోట్ల తో పబ్లిక్స్ స్కూల్ కూడా వచ్చిందని, తెలంగాణలో 12 తరగతి విద్యార్థుల వరకు అల్పాహార పథకాన్ని అందిస్తామన్నారు. అల్పాహార పథకం రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది విద్యార్థుల కు ఇస్తున్నాం అని, టెక్నాలజీ కోసం నూతనంగా ఏటిసి సెంటర్ ప్రారంభించామని, అందులో శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా నాణ్యమైన, పౌష్టికాహారం అందించి, విద్య వైద్యం పై దృష్టి సారిస్తున్నామన్నారు. మెదక్ లో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభించి మెదక్ విద్యార్థుల యొక్క భవిష్యత్ ను ఉన్నతంగా తీర్చిదిద్దామన్నారు.

**చారిటబుల్ ట్రస్ట్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ అధ్యక్షులు**

మెదక్ సెప్టెంబర్ 26 (ప్రజా స్వరం)
హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ (హెచ్‌కెఎంసిఎఫ్) అధ్యక్షుడు, అక్షయ పాత్ర ఫౌండేషన్ (టిజి & ఆంధ్ర ప్రదేశ్) ప్రాంతీయ అధ్యక్షుడు హిస్ గ్రేస్ శ్రీ సత్య గౌర చంద్ర దాస (ఎం.టెక్., ఐఐటి మద్రాస్), మాట్లాడుతూ... జిల్లాలో 30 వేల మంది విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కేంద్రీకృత కిచెన్ ను మొదట కొడంగల్ లో ప్రారంభించామన్నారు. కొడంగల్ లో ఆదర్శంగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా కొడంగల్ పరిసర పాఠశాలలో 20% విద్యార్థులు అదనంగా పాఠశాలలో చేరుతున్నారన్నారు.
కిచెన్ షెడ్ ను 40 రోజుల్లో పూర్తి చేశామన్నారు. జిల్లా ప్రజలందరూ సహకారంతో ముందుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, సీఈవో హెచ్ కెఎం సి ఎఫ్ శ్రీ కౌంతేయదాస ప్రభుజి, పిఆర్ ఇన్చార్జి రవిలోచన దాస ప్రభువుజి, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, సంబంధిత ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# మేడ్చల్ :టీజీసీఎంఎఫ్‌సీ మేడ్చల్ కోఆర్డినేటర్‌గా ఆరె పవన్ కల్యాణ్

**ప్రజాస్వరం,మేడ్చల్:**

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీసీఎంఎఫ్‌సీ) మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఆరె పవన్ కల్యాణ్ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడిగా కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఆయన కృషి చేశారు. ఆయన చురుకైన నాయకత్వాన్ని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ నియామకం తనపై మరింత బాధ్యతను పెంచిందని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన టీజీసీఎంఎఫ్‌సీ చైర్మన్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999